



# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి ఆదివారం 12-05-2024 సంపుటి : 06 సంచిక : 239 పేజీలు : 8 వెల : రూ 3-00




## వికలాంగులకు ప్రతి నెలా రూ.6 వేల పెన్షన్
## నంద్యాల ప్రజాగళం సభలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 11 – టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి సంతకం మెగా డీఎస్సీపైనే పెడతానని టీడీపీ అధినేత నార చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. వికలాంగుల పింఛను రూ.6 వేలకు పెంచుతానని స్పష్టం చేశారు. నంద్యాలలో శనివారం ప్రజాగళం సభలో చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...."ఎండను సైతం లెక్కచేయకుండా ఆడబిడ్డలు, కార్యకర్తలు అందరూ సభకు వచ్చారు. నంద్యాలకు రాగానే నాకు సెప్టెంబర్ 9వ తారీఖు గుర్తొస్తుంది. ఇక్కడ లాస్ట్ మీటింగ్ పెట్టి తెల్లవారితే హైదరాబాద్ వెళ్లాలని ఆ రోజు రాత్రి. ఈ రోజు సాయంత్రం ఐదు గంటలకు ఎన్నికల సభలు పూర్తవుతాయి. రేపు ఆగితే ఎల్లుండు సైకో జగన్ ని ఇంటికి పంపే రోజు. సైకోని వదిలించుకోడానికి మీరందరూ సిద్ధమా.నన్ను చంపుతామని బెదిరించారు నా మీద ఎన్ని కేసులు పెట్టి అరెస్టు చేసినా నేను భయపడతానా? జైల్లో నన్ను చంపుతామని బెదిరించారు అయినా నేను భయపడలేదు. నన్ను చంపితే వైసీపీ వాళ్లు ఎవరి మెడకు వారు ఉరేసుకోవాల్సి వస్తుంది. నేనెప్పుడూ ప్రాణానికి భయపడలేదు. మీ ప్రాణాలు, మీ ఆస్తులు కాపాడడానికి లా అండ్ ఆర్డర్ ని సక్రమంగా నడిపించాను. నా శ్వాస ఉన్నంత వరకూ మీకోసమేనా శ్వాస ఉన్నంత వరకు తెలుగు జాతికోసం, మీ బిడ్డల భవిష్యత్తుకోసం, పేదవాళ్ల కోసమే పనిచేస్తా. ఈ రోజు రాష్ట్రంలో ప్రజలకు అభివృద్ధి చేసి సంక్షేమాన్ని అందించాలి. హైదరాబాద్ అంత అభివృద్ధి జరగడానికి కారణం ఎవరు? ఇప్పుడు అక్కడ ఐటీ ఉద్యోగులు ప్రపంచమంతా వెళ్లి డబ్బులు సంపాదిస్తున్నారు. రాష్ట్రంలో అద్దంలాంటి నేషనల్ రోడ్లు వచ్చాయంటే దానికి కారణం నేనే. మీరు వాడుతున్న సెల్ ఫోన్లు తీసుకొచ్చాను. సైకో జగన్ తనకి ఫోను లేదు, అడ్రస్ లేదని అబద్దాలు చెప్తున్నాడు. అలాంటి వాడు మిమ్మల్ని ఆదరిస్తాడా. 2014 లో ఎన్నో ఇబ్బందులు వచ్చాయి. హైదరాబాద్ ని అభివృద్ధి చేశా కానీ, ఆరోజు రెండు రాష్ట్రాలుగా విడిపోవడం వల్ల చాలా బాధపడ్డాను మీరు కూడా భయపడ్డారు. నేను ఈ రాష్ట్రాన్ని బాగు చేస్తాననే నమ్మకం మాత్రం నాకు ఉంది. రాజధాని లేని రాష్ట్రంరాజధానిగా అమరావతిని ప్లాన్ చేశాను. హైదరాబాద్ కంటే గొప్పగా చేయాలని నిర్ణయించుకుని అమరావతిని రాజధానిగా చేయలనుకున్నాను. ఇప్పుడు రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారు. రాజధాని ఏదంటే మూడుముక్కల తిక్కలోడు మూడు రాజధానులంటూ నాటాకాలాడుతున్నాడు. జగన్ విశాఖపట్నంలో ప్రమాణ స్వీకారం చేస్తాడంట ఇడుపులపాయలో తన తండ్రి సమాధి పక్కన చేయమనండి. మనకు రాజధాని లేకుండా నాశనం చేశాడు. గొప్ప రాజధానిని నిర్మించి పోలవరాన్ని 72 శాతం పూర్తి చేసి పోలవరం నీళ్లు, గోదావరి నీళ్లు రాయలసీమ కు తెచ్చి బనకచర్లకు అందించాలనుకున్నా కానీ, జగన్ పోలవరాన్ని గోదావరిలో ముంచేశాడు. అభివృద్ధికి పునాదులు వేసిన పార్టీ టీడీపీరాష్ట్రంలో అభివృద్ధిని పుంతలు తొక్కించాను. నంద్యాలకు బై ఎలక్షన్ కి వచ్చి రోడ్లు వెడల్పు చేస్తానని చెప్పాను చేసి చూపించాను. 14,500 టిడ్కో ఇళ్లు కట్టించాను. ఐదేళ్లయినా నేను కట్టిన ఇళ్లకు సైకో రంగులు వేసుకున్నాడు కానీ మీకివ్వలేదు. కరెంటు స్తంభాలు, శ్మశానాలను కూడా వదిలిపెట్టకుండా ఈ రంగులు పిచ్చోడు వైసీపీ రంగులు వేసుకుని నేను మొత్తం మార్చేశానని చెప్తున్నాడు. నంద్యాల అభివృద్ధి కావాలంటే అది టీడీపీతోనే జరుగుతుంది. రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చాను. ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 లక్షల ఉద్యోగాలు కల్పించాను. రెండంకెల అభివృద్ధి చేశా. ఆదాయాన్ని పెంచి 100 సంక్షేమ కార్యక్రమాలు మీకిచ్చాను. దేశంలోని మూడు రాష్ట్రల్లో ఆంధ్రప్రదేశ్ ని నిలిపే బాధ్యత నాది. 78 ఏళ్లుగా నాకు రాజకీయంలో అనుభవం ఉంది. ఇప్పటికి 9 వ సారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నా. నా జీవితంలో ఇలాంటి చేతగానీ దద్దమ్మను ముఖ్యమంత్రిగా ఎప్పుడూ చూడలేదు. కోవిడ్ వచ్చినప్పుడు కూడా వర్చువల్ సమావేశాలు పెట్టి మీకోసం పనిచేశా.వైసీపీ ప్రభుత్వంలో బాదుడే.. బాదుడు...ఎన్నికల ముందు పాదయాత్రకు వచ్చాడు. బుగ్గలు నిమిరాడు తలపై ముద్దులు పెట్టాడు. అధికారంలోకి వచ్చిన తర్వాత పిడి గుద్దులు గుద్దాడు. అందుకే నేను 'ఇదేం ఖర్మ' అని ప్రోగ్రాంతో రాష్ట్రమంతా తిరిగి సమీక్ష చేసి మీకు అండగా నిలబడ్డాను. శుక్రవారం వస్తే చాలు పోలీసులు గోడలు దూకుతారు. మరోవైపు వైసీపీ నాయకులు ప్రొక్లేన్లు తీసుకొస్తారు. ఎవరైనా ఎదురు మాట్లడితే వాళ్ల ఇళ్లు కూల్చివేస్తారు. వీళ్లకి కూల్చడం తెలుసు గానీ, కట్టడం తెలియదు. విధ్వంసం మొదలయ్యింది మా ఇంటి పక్కన ఉన్న ప్రజా వేదిక కూల్చివేతతోనే అప్పటినుండి ఈ సైకో జగన్ రెడ్డి దేనిని వదిలి పెట్టకుండా కూల్చివేస్తూ వస్తున్నాడు. సాగునీటి రంగాలన్నీ సర్వనాశనంజగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటి రంగాల్ని సర్వనాశనం చేశాడు. సాగునీటి ప్రాజెక్టుల గురించి ప్రజంటేషన్ నిర్వహించి నందికొట్కూరు, శ్రీశైలం దగ్గర ప్రారంభించి పది రోజుల్లో రాష్ట్రమంతా తిరిగాను. అంగళ్లులో నామీద దాడి చేసి తిరిగి నా మీదే కేసు పెట్టారు. ఎన్ని కేసులు పెట్టినా దూసుకెళ్తా ఏం చేస్తారో చేసుకోండి అని ముందుకు వెళ్లాను. రాయలసీమ ద్రోహి జగన్ రెడ్డి ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదు. 2019 లో 52 సీట్లకు 42 గెలిపించారు. కులంపేరు, మతం పేరు, చెప్పి ఓట్లు వేయించుకుని మిమ్మల్ని గోదావరిలో ముంచేశాడు. నేను కూడా రాయలసీమ బిడ్డనే ఈ గడ్డపైనే పుట్టాను. మీ అందరి అభిమానంతో రాజకీయల్లో దూసుకెళ్తూ అందరి దగ్గర గౌరవాన్ని సంపాదించా. ప్రజలందరికీ కొన్ని ప్రశ్నలుమీకు విధ్వంస పాలన కావాలా? అభివృద్ధి పాలన కావాలా? సంక్షేమపాలనకావాలా?సంక్షోభపాలనకావాలా?మీ బిడ్డలకు ఉద్యోగాలు కావాలా?గంజాయి,డ్రగ్స్, కావాలా? నడిపించే నాయకుడు కావాలా? నరరూప రాక్షసులు కావాలా? విలువ ఇచ్చే ముఖ్యమంత్రి కావాలా? సైకో ముఖ్యమంత్రి కావాలా? ఆస్తులకు రక్షణ కావాలా? ల్యాండ్ గ్రాబింగ్ కావాలా? నడుములు విరిచే దారుణమైన రోడ్లు కావాలా? రహదారి భద్రత కావాలా? రూ.10 ఇచ్చి రూ.100 కొట్టేసే దొంగ కావాలా? మీ ఖర్చులు తగ్గించి ఆదాయాన్ని పెంచే నాయకుడు కావాలా? నాణ్యత లేని మద్యంతో ప్రజల ప్రాణాలు తీస్తున్నాడుగతంలో రూ. 40 ఉండే క్వార్టర్ బాటిల్ ఈ రోజు రూ.200 అయింది. అది కూడా జే ట్యాక్స్ తో 'జే బ్రాండ్' మద్యం. చిన్న చిన్న కొట్లులో కూడా ఆన్ లైన్ పేమెంట్ విధానం ఉంది మరి మందు షాపుల్లో ఎందుకు లేదు. మద్యపాన నిషేదమని మాట తప్పాడు. జగన్ మోసకారి, ప్రజల్ని పీక్కు తినే పీనుగు. మద్యం షాపుల్లో ఆన్ లైన్ పేమెంట్ ఎందుకు లేదో చెప్పే దమ్ము జగన్ రెడ్డికి ఉందా. నేను అధికారంలోకి వచ్చిన తర్వాత జే బ్రాండ్ రద్దు చేసి మీ ఆరోగ్యాన్ని కాపాడతా. ధరలు కూడా నియంత్రిస్తా. కరెంటు బిల్లు నియంత్రణ కావాలా? షాకు కొట్టే కరెంటు బిల్లులు కావాలా ? గతంలో రూ.200 తో నాణ్యమైన కరెంటు ఉంటే ఇప్పుడు రూ.1000 కు పెంచారు. ఉచిత ఇసుక కావలా ? ఇసుక మాఫియా కావాలా? మళ్లీ ఈసారి ఎన్నికల్లో ఎక్కడైనా ఫ్యాను తిరిగితే ఆ ప్రాంతానికి మళ్లీ కష్టాలే.గతంలో బాబాయి శవంతో శవరాజకీయంజగన్ రెడ్డి మీ బాబాయిని చంపిందెవరు నిజం చెప్పాలి. నీ చెల్లెల్లు అడిగారు, నేను అడిగాను, ప్రజలు అడుగుతున్నారు సమాధానం చెప్పగలవా. కోడి కత్తి డ్రామా, గులకరాయి డ్రామాలు ప్రజలకొద్దు మీకు సంక్షేమం కావాలి. బాబాయిని గొడ్డలితో చంపి, చెల్లెల్ని కారెక్టర్ గురించి మాట్లాడే వాడిని మీరు నమ్ముతారా? ఆఖరికి తన కన్న తల్లి శీలాన్ని కూడా తప్పుపట్టిన దుర్మార్గుడు జగన్. తల్లిని రాజకీయాలకు ఉపయోగించుకుని అవసరం తీరాక గెంటేశాడు. మీకోసం నేనొక మేపిఫెస్టో ఇచ్చా, జగన్ ఒక మేనిఫెస్టో ఇచ్చాడు. చిలకలూరి పేట సభలో జగన్ మాట్లాడారు ఈ ఎన్నికల్లో జగన్ కి ఓటేస్తే పథకాలు కొనసాగింపు లేదంటే పథకాలు ముగింపేనని చెప్పాడు. నేను పేదవారి వైపు ఉంటాను. సంక్షేమాన్ని అభివృద్ధి చేస్తాను. జగన్ నొక్కిన బటన్ల వల్ల ఎవరికీ అభివృద్ధి జరగలేదు. జనవరిలో బటన్ నొక్కితే మే వరకు కూడా మీ అకౌంట్లకు డబ్బులు రాలేదు. ఆ డబ్బులు పడడానికి ఇంకా ఎన్ని గంటల సమయం పడుతుందో. దొంగ మాటలు చెప్పి రాజకీయ లబ్ది కోసం ఎన్నికల ముందు డబ్బులు ఇస్తానని మాయమాటలు చెప్తున్నాడు. 99 శాతం హామీలన్ని పూర్తి చేశాడంటా. అక్కలకు, చెల్లెల్లకు ఇళ్లు కట్టించాడట. టీడీపీ వచ్చిన తర్వాత సంపద సృష్టించి, ఆదాయాన్ని పెంచి పేదవాళ్లకి పంచుతానని హామీ ఇస్తున్నా. గొప్ప నాయకుడు పవన్నా మిత్రుడు పవన్ కళ్యాణ్ సినీ రంగాల్లోనే కాదు రాజకీయాల్లో కూడా నిజమైన హీరో. ప్రజల కోసం పనిచేసే వ్యక్తి. జనసేన జెండాలు పట్టుకుని అల్లు అర్జున్ వస్తే తప్పుడు రాజకీయాలు, చౌక రాజకీయాలు చేశారు. వైసీపీ వాళ్లంతా పనికిమాలిన రాజకీయాలు, చెత్త రాజకీయాలు చేస్తున్నారు. పెద్ద సైకో తాడేపల్లి ప్యాలెస్ లో ఉంటే చిన్న సైకో నంద్యాలలో ఉన్నాడు. అతనే సండే ఎమ్మెల్యే సండే మాత్రమే వస్తాడు. అతనిని శాశ్వతంగా ఇంటికి పంపిద్దాం. సూపర్ -6 తో అభివృద్ధిఈరోజు మీకోసం సూపర్-6 పథకాలు తీసుకొచ్చాం. మహాశక్తి పథకం కింద ప్రతి ఒక్క ఆడబిడ్డకు రూ. 1500లు, సంవత్సరానికి రూ.18 వేలు, 5 సంవత్సరాలకు రూ. 90 వేలు ఇస్తా. ఇంట్లో ముగ్గురుంటే రూ.18 వేలు చొప్పున సంవత్సరానికి రూ.58వేలు ఐదేళ్లకు 2 లక్షల 70 వేలు మీకు ఇస్తా. 'తల్లికి వందనం' కింద ఇంట్లో చదువుకునే బిడ్డలు ఎంతమంది ఉంటే అంతమందికి రూ.15 వేలు చొప్పున ఇస్తా. సైకో జగన్ ను వచ్చే ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడించి వైసీపీని, జగన్ ను భూస్థాపితం చేస్తామని గుర్తుపెట్టుకోవాలని హెచ్చరిస్తున్నా. నేనొచ్చిన తర్వాత రెండో సంతకం ల్యాండ్ గ్రాబింగ్ యాక్టును తీసేస్తానని హామీ ఇస్తున్నా. మైనార్టీల సంక్షేమాభివృద్ధి కోసంఅన్న క్యాంటిన్లు, దుల్హాన్, రంజాన్ తోఫా, విదేశీ విద్య, చంద్రన్న భీమా, మీ ఆరోగ్యం కోసం రూ.25 లక్షలతో హెల్త్ ఇన్సూరెన్స్ కూడా తీసుకొస్తాను. మైనార్టీలు ఎక్కువగా ఉండే ప్రాంతం నంద్యాల. కర్నూలులో, హైదరాబాద్‌లో ఉర్దూ యూనివర్సిటీలు కట్టించా. ఉర్దూను రెండో భాషగా చేశా. కడప, విజయవాడలో ఆజ్ హౌస్‌లు కట్టించా. దుల్హాన్ ఇచ్చా. ఇమామ్, మౌజామ్ లకు రూ. 5వేలు ఇచ్చా. వైసీపీ నాయకులు ఎన్నార్సీ గురించి, సీఏ గురించి మాట్లడుతున్నారు. పార్లమెంట్ లో దొంగ ఓట్లు వేసి ఎవరు పాస్ చేశారు. ఢిల్లీలో గలీజు రాజకీయలు చేసి గ్లీ కొచ్చి ఇతరులపై నిందలు వేస్తారు. మైనార్టీలకు 2014 లో 4 శాతం రిజర్వేషన్లు కాపాడా. మళ్లీ మన ప్రభుత్వం వచ్చిన తర్వాత 4 శాతం రిజర్వేషన్లు కల్పిస్తా. ఆజ్ యాత్రకు వెళ్లే వాళ్లకు లక్ష రూపాయలు సహాయం చేస్తా. ఇమౌములకు మౌజామ్ లకు రూ.10 వేలు ఇస్తా. క్వాజీలకు గుర్తించే బాద్యత నాది. ముస్లింల ఓట్లన్నీ టీడీపీ కే వేయాలి. మాదిగలకు కూడా ఎ,బి,సి,డి కేటగిరీ పెట్టి న్యాయం చేస్తా. బీసీ డిక్లరేషన్ ఇచ్చాం. లక్షా యాభై వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి వాళ్లకు కూడా న్యాయం చేస్తా. నేను అబ్దుల్ కలామ్ ని ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా చేస్తే. జగన్ రెడ్డి అబ్దుల్ సలీం ని వేదించి నలుగురు కుటుంబసభ్యులనుభయపెట్టిచనిపోయేలా చేశాడు. మిస్బాను పొట్టన పెట్టుకున్నారు. ఇలా అనేక మందిని చంపేశారు. అబ్దుల్ కలాంని ప్రెసిడెంట్ చేసిన పార్టీ కావాలా? అబ్దుల్ సలీంను చంపేసిన పార్టీ కావాలా? రేపు ఎన్నికల్లో క్రమశిక్షణగా ఉండి పార్టీ కోసం పనిచేసే టీడీపీ అభ్యర్థి ఫరూఖ్ కి ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నా.

## ఓటు వేసేందుకు ఎపిక్ కార్డు లేదని ఆందోళన వద్దు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి సృజన.



కర్నూలు మే 11, విభారే న్యూస్ – సాధారణ సార్వత్రిక ఎన్నికలు 2024 లో భాగంగా పోలింగ్ రోజు ఎపిక్ కార్డు లేదని ఓటర్లు ఎవరు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ తెలిపారు. క్రింద పేర్కొన్న 13 రకాల గుర్తింపు పత్రాలు ఏవైనా చూపించి నిర్భయంగా ఓటేయవచ్చని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. 13 రకాల కు చెందిన గుర్తింపు పత్రాల వివరాలు... 1ఓటరు గుర్తింపు కార్డు 2 ఆధార్ కార్డు,3 జాబ్ కార్డు, 4 బ్యాంక్ పాస్ పుస్తకం, 5 హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డ్,6 డ్రైవింగ్ లైసెన్స్, 7 పాన్ కార్డు,8 కార్మిక శాఖ వారి స్మార్ట్ కార్డు 9 పాస్పోర్ట్, 10 ఫోటో కలిగిన పెన్షన్ డాక్యుమెంట్, 11 సర్వీస్ ఐడికార్డు,12 అధికారిక గుర్తింపుకార్డు,13 యూనిక్ డిసిబిలిటీ ఐడి పై తెలిపిన ఐడీలలో ఏదైనా ఒకటిచూపించిఓటుహక్కును వినియోగించుకోవచ్చునని జిల్లా ఎన్నికలఅధికారిడాక్టర్‌జిసృజన తెలియజేశారు. ఓటర్ సమాచారం స్లిప్పులు మరియు పోలింగ్ స్టేషన్ లో గుర్తింపు ప్రూఫ్ గా ఉపయోగించకూడదు. పోలింగ్ బూత్ లోనికి సెల్ ఫోన్స్ గాని ఎలక్ట్రానిక్ పరికరాలను కానీ అనుమతించబడవని కలెక్టర్ గారు తెలియజేశారు.

## పాకిస్థాన్ కు అణు బాంబు నిర్వహణ కూడా కష్టమే: మోడీ

భువనేశ్వర్: జూన్ 4 తర్వాత కాంగ్రెస్ కు ప్రతిపక్షానికి కావలసినంత సంఖ్యా బలం కూడా ఉండకుండా 50 స్థానాల కంటే తక్కువ బలమే ఉండగలదని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఒడిశాలోని కంధమల్ లోక్ సభ నియోజకవర్గంలో నిర్వహించన ర్యాలీలో ఆయన నేడు ప్రసంగించారు. ఎన్డిఏ 400కు



పైగా సీట్లను గెలువబోతోందని, బిజెపి ఇదివరకటి తన రికార్డులను కూడా అధిగమించగలదని అన్నారు. "నా మాటను రికారు&ఢగా ఉంచుకోండి" అని మోడీ అన్నారు."షెహజాదా రాహుల్ గాంధీ ప్రతి రోజు ఏదో ఓ ప్రకటన చేస్తూనే ఉన్నారు. ప్రతిపక్షానికి కావలసినంత సంఖ్యా బలం కూడా కాంగ్రెస్ కు ఇవ్వకూడదని దేశం నిర్ణయించుకున్నది. కాంగ్రెస్ కు 50 కంటే తక్కువ సీట్లే వస్తాయి. అది మీరు జూన్ 4న చూస్తారు" అని మోడీ తెలిపారు.కాన్పూర్ ర్యాలీలో రాహుల్ గాంధీ "జూన్ 4 తర్వాత మోడీ ప్రధానిగా ఉండబోరు" అన్న మరునాడే మోడీ పై విధంగా అన్నారు. అటల్ బీహారీ వాజ్ పేయి ప్రధానిగా ఉన్నప్పుడు భారత్ పొక్రాన్ లో న్యూక్లియర్ టెస్ట్ చేసింది. ప్రపంచంలోని భారతీయులంతా దీనికి గర్వించారు. పాకిస్థాన్ అణు శక్తికి కాంగ్రెస్ భయపడుతోంది. వారి మైండ్ సెట్ అలాంటిది. "నేడు పాకిస్థాన్ తన అణు బాంబును నిర్వహించడం కూడా కష్టమైపోయింది. దానిని వారిప్పుడు ఎవరికైనా అమ్మేయాలని అనుకుంటన్నారు. అయితే అది అంత నాణ్యమైనదేమి కాదని ప్రజలకు తెలుసు. అందుకే అది అమ్ముడవ్వడం లేదు" అని ప్రధాని చెప్పుకొచ్చారు.కాంగ్రెస్ విధానాల వల్లే జమ్మూకశ్మీర్ 60 ఏళ్లుగా ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటూ వస్తోందన్నారు. ఒడిశా ప్రభుత్వం పై కూడా ప్రధాని విమర్శలు గుప్పించారు. పూరీ జగన్నాథ్ మందిరం తాలూకు 'రత్న భండార్' తాళంచెవులు కనిపించకుండా పోయాయని అన్నారు. రత్న భండార్ లో ఉన్న ఆభరణాల రికార్డులను మెయిన్ టైన్ చేయాలని జగన్నాథ్ మందిర చట్టం చెబుతోందని మోడీ వివరించారు. రత్న భండార్ తాలూకు ఆభరణాల అధికారిక రికార్డులు లేవు. ఆ భండాగారం తాళంచెవులు పోయి ఆరు సంవత్సరాలు అవుతున్నాయి" అని మోడీ వివరించారు.

# సంపాదకీయం

ఆదివారం 12-05-2024

## చార్ సౌ... సాధ్యమేనా

లోక్‌సభ ఎన్నికల్లో మూడోసారి గెలిచి సత్తా చాటాలని భారతీయ జనతా పార్టీ ఆరాటపడుతోంది. 2024 ఎన్నికల్లో 400 సీట్లు గెలిచేందుకు బీజేపీ ఇప్పటికే రూట్‌మ్యాప్‌ను ప్రకటించింది. కొత్త పొత్తులు, విపక్ష నేతలను పార్టీలను చేర్చుకోవటంతో బాటు 2019లో ఓడిన స్థానాల మీద ప్రత్యేక దృష్టి పెట్టింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ బరిలో నిలిచే సీట్లు 450. మోదీ చెబుతున్నట్లు బీజేపీ 370 గెలవాలంటే పోటీచేసే మొత్తం సీట్లలో ఏకంగా 82 శాతం సీట్లు గెలవాల్సి ఉంది. ఇప్పటి వరకు బీజేపీ చరిత్రలో ఆ పార్టీ 2019లో 70 శాతం సీట్లలో గెలిచింది. ఆ ఎన్నికల్లో 436 సీట్లకు పోటీ చేసి 303 సీట్లను బీజేపీ గెలుచుకోగలిగింది. పై సమీకరణాల నేపథ్యంలో బీజేపీ, దాని మిత్ర పక్షాలు కనీసం గతంలో గెలుచుకున్న సీట్లలో 60 నుంచి 70 సీట్లు కోల్పోయే పరిస్థితి నెలకొన్న నేపథ్యంలోనే బీజేపీ రెండు మెట్లు దిగి ఏపీ, ఒడిసా వంటి రాష్ట్రాల్లో పొత్తుకు సిద్ధపడింది. 2019 ఎన్నికల్లో గెలుచుకున్న303కు అదనంగా మరో 97 స్థానాలు గెలిచి, 1984లో ఇందిరాగాంధీ మరణం తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన 49% ఓట్లు, 404 సీట్ల రికార్డును తిరగరాయాలని పనిచేస్తోంది. దీనికోసం 'అబ్ కీ బార్.. చార్ సౌ కీ పార్' అనే ఆకర్షణీయమైన నినాదాన్నీ ఆ పార్టీ ప్రచారం చేస్తోంది. ప్రపంచపు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశపు కీలక రాజకీయ పక్షంగా బీజేపీ ఆకాంక్ష మెచ్చుకోదగినదే అయినా క్షేత్రస్థాయి వాతావరణం మాత్రం అదంత సులభం కాదనే సందేశాలు పంపుతోంది. బీజేపీకి ఆయువుపట్టుగా ఉన్న రాష్ట్రాలో ఉత్తరప్రదేశ్ మొదటిది. ఇక్కడి 80 లోక్‌సభ సీట్లలో 2019లో ఆ పార్టీ 62 సీట్లు గెలిచింది. నాడు ఆ మిగిలిన స్థానాల్లో బీఎస్పీ 10, ఎస్పీ 5, ఇతరులు 3 స్థానాలు గెలుచుకున్నాయి. అయితే, 2022 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 41.29 శాతం ఓట్లకే పరిమితమైంది. యూపీలో మోదీ, యోగీ చరిష్మా, అయోధ్య అంశాలు బీజేపీకి కలిసొచ్చే మాట నిజమే అయినా, ఈసారి అక్కడ సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీపార్టీ పొత్తుకు సిద్ధమయ్యాయి. మొత్తం 80 సీట్లలో 62 స్థానాల్లో ఎస్పీ, 17 సీట్లలో కాంగ్రెస్, 1 స్థానంలో ఆప్ పార్టీలు పోటీ చేయనున్నాయి. ఇక్కడ మాయావతి ఒంటరిగా పోటీచేయటం వల్ల 2019లో బీజేపీ సాధించిన 62 సీట్లలో కనీసం 15 సీట్లలో కోత పడే ప్రమాదం ఉంది. ఇక బీహార్ విషయానికి వస్తే.. అక్కడున్న మొత్తం 40 సీట్లలో 2019లో బీజేపీ 17, దాని నాటి మిత్రపక్షం జేడీయూ 16, లోక్‌జనశక్తి పార్టీ 6 సీట్లు సాధించాయి. అయితే, ఆ తర్వాత నితీష్ కుమార్ లాలూయాదవ్ ఆర్జేడీతో చేతులు కలిపి అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గి సీఎంగా బాధ్యతలు చేపట్టి, తాజాగా తిరిగి ఎన్డీయేలో చేరారు. ఈ గోడదూకుడు వ్యవహారం నితీష్‌తో బాటు బీజేపీకి కూడా చెడ్డపేరు తీసుకొచ్చింది. దీనికి తోడు కాంగ్రెస్, ఆర్జేడీ, వామపక్షాలతో పొత్తు పెట్టుకోవటంతో అక్కడ ఈసారి ఎన్డీయే సీట్లు సగానికి కోతపడనున్నాయని సర్వేలు చెబుతున్నాయి. ఆ పక్కనే ఉన్న జార్ఖండ్‌లో 14 సీట్లు ఉండగా, 2019లో బీజేపీకి 11, దాని మిత్రపక్షమైన ఏజేఎస్‌యు ఒక స్థానంలో గెలిచింది. 2024లో కాంగ్రెస్ 7, జేఎంఎం 5, వామపక్షాలు 2 స్థానాల్లో ఇక్కడ బరిలో దిగనున్నాయి. హేమంత్ సోరెన్ రాజీనామా తర్వాతి పరిణామాలు ఇక్కడ కాంగ్రెస్– జేఎంఎం కూటమి వల్ల బీజేపీ ఆరు సీట్లకి మించి గెలవటం కష్టమనే అభిప్రాయం ఉంది. మహారాష్ట్రలోని 48 సీట్లలో 2019లో బీజేపీ 23, శివసేన 18 స్థానాలు గెలవగా, కాంగ్రెస్, ఎంఐఎం చెరొకస్థానం, ఎన్సీపీ 4 సీట్లు గెలిచింది. కానీ, అసెంబ్లీ ఎన్నికల తర్వాత శివసేన.. కాంగ్రెస్, ఎన్సీపీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయటం, అది శివసేన చీలికతో ప్రభుత్వం పడిపోవటం జరిగింది. ఈసారి శివసేన (ఉద్ధవ్) 19, కాంగ్రెస్16, శరద్పవార్‌ఎన్సీపీ 9 స్థానాల్లో పొత్తుమీద పోటీ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ కూటమి అవకాశాలు గతంలో కంటే మెరుగుపడ్డాయని సమాచారం. ఇక ఒడిసాలో 21 సీట్లుండగా బీజేపీ–బీజేడీ పొత్తు కుదుర్చుకున్నాయి. ఇక్కడ బీజేపీ 8, బీజేడీ 13 సీట్లలో పోటీచేస్తున్నాయి కనుక ఇది బీజేపీకి విన్ విన్ డీల్ లాంటిది. ఇక పశ్చిమబెంగాల్‌లోని 42 సీట్లలో 2019లో బీజేపీ 18 సీట్లు గెలిచింది. ఈసారి మమత ఒంటరి పోరుకు సిద్ధం కావటంతో కాంగ్రెస్, వామపక్షాలతో కలిసి బరిలో దిగనుంది. ఇక్కడ బీజేపీ బలం గతంలో కంటే తగ్గే అవకాశం ఉండటం ఇండియా కూటమికి కలిసొచ్చే అంశం కావచ్చు. ఇటీవలి మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో బీజేపీ అధికారంలోకి వచ్చిన మాట నిజమే అయినా కాంగ్రెస్, బీజేపీల మధ్య ఓట్ల శాతం తక్కువే. ఈ మూడు రాష్ట్రాల్లోని 65 సీట్లలో 2019లో బీజేపీ 61 స్థానాల్లో గెలిచింది. 2024 ఎన్నికల్లో బీజేపీ ఈ మూడు రాష్ట్రాల్లో 40 సీట్లకు మించి సాధించే అవకాశం లేదని సర్వేలు చెబుతున్నాయి. ఇక.. గుజరాత్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లలోని 52 లోక్‌సభ సీట్లుండగా, 2019లో వీటిన్నింటిలోనూ బీజేపీయే గెలిచింది. కానీ, ప్రస్తుతం హిమాచల్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉండటం, ఢిల్లీ, గుజరాత్‌లో కాంగ్రెస్– ఆప్‌తో పొత్తు, హర్యానాలో వీస్తున్న కాంగ్రెస్ సానుకూల పవనాల వల్ల ఈ 5 రాష్ట్రాల్లో బీజేపీ గతంలో కంటే 12 సీట్లు కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. ఇక దక్షిణాదిన గల తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, కర్నాటక, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణలలో మొత్తం 128 సీట్లుండగా, 2019లో బీజేపీ కర్ణాటకలో 25, తెలంగాణలో 4 సీట్లు గెలిచింది. ఈసారి కర్ణాటకలో కాంగ్రెస్ హవా కారణంగా పది స్థానాలకు, తెలంగాణలో 4 సీట్లకే పరిమితం కానుందని సర్వేలు చెబుతున్నాయి. అయితే.. ఏపీలో జనసేన– టీడీపీ పొత్తులో 6 సీట్లు పొందినా అందులో గెలిచేది సగమే. గెలిచే సీట్లు 18 లోపే ఉండవచ్చు. తమిళనాడు, కేరళలో అది సీట్లు పొందే పరిస్థితి లేదు.

# యువతే దేశ భవిత

**-- మీడియాతో జై భారత్ పార్టీ కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థి సుంకర శ్రీధర్ రాయల్**





కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం జై భారత్ పార్టీ సుంకర శ్రీధర్ రాయల్ మాట్లాడుతూ, గత ప్రభుత్వాలు తమ స్వలాభం కోసమే పాటుపడ్డారు, కానీ రాష్ట్ర అభివృద్ధికి పాటుపడలేరని అలాగే, ప్రస్తుత రాజకీయాలు డబ్బు ఆధిపత్యం నడుస్తుంది అని,యువతకు ప్రాధాన్యత లేకుండా రాజకీయ వ్యవస్థ ప్రజాస్వామ్యం వ్యవస్థగా కాకుండా ,వారసత్వ రాజకీయమని నేటి రాజకీయ నాయకులు అనుకుంటున్నారు, జై భారత్ పార్టీ అధ్యక్షుడు జెడి లక్ష్మీనారాయణ గారు ప్రజలకు అవినీతిరహిత రాష్ట్రంగా అభివృద్ధి చేయాలని ఏజెండగా కొనసాగిస్తున్నారు, ఈ పార్టీ అన్ని వర్గాల పార్టీ, లాయర్లు వ్యాపారవేత్తలు, విద్యావంతులు, ప్రజాధారణ పొందినటువంటి గొప్ప సంఘసంస్కర్తలు కూడా జై భారత్ పార్టీలో ఉన్నారు, ప్రభుత్వ అధికారులు నేటి రాజకీయ నాయకులకు ఉత్తాసు పలుకుతున్నారు ,ఈ విధంగా అధికారులను నిర్లక్ష్యంగా, రాష్ట్రం ఎంతో వెనుకబాటుతనాన్ని పోతుందని, మరి ముఖ్యంగా రాయలసీమ ప్రాంతం అయినటువంటి కర్నూలు జిల్లా ఎన్నో సమస్యలతో కొట్టుమిట్టలాడుతుంది అని, అందులో నీటిపారుదల విషయమైతేనేమి, ఉద్యోగ అవకాశాల విషయమైతనేమి ,ఆర్థికంగా ఎన్నో విధాలుగా వెనకబాటుపడుతూనే ఉంది, నన్ను కర్నూల్ ప్రజలు ఎంపీగా గెలిపిస్తే కర్నూలును ఒక విజన్ గా నా ప్రణాళిక ప్రకారం 2050 కి అంత అభివృద్ధి చెందిన జిల్లాగా తీర్చిదిద్దుతానని ,అలాగే దేశ సుప్రీంకోర్టు, దక్షిణాది రాష్ట్రాలలో మరి ముఖ్యంగా కర్నూలు జిల్లాలో అన్ని విధాలుగా అనుకూలంగా ఉన్నటువంటి సుప్రీంకోర్టు బెంచు ఏర్పాటు చేయవలసిందిగా డిమాండ్ చేస్తున్నాను, కర్నూలుకు ఐఐటి ఐఏఎం స్కిల్ డెవలప్మెంట్ ఇంటర్నేషనల్ స్కూల్స్, అభివృద్ధిపరిచే దిశగా చేస్తానని ప్రస్తుత ప్రభుత్వాలు కనీస అవసరాలు కూడు ,గూడు ,గుడ్డ ,కనీస అవసరాలు కూడా తీర్చలేని స్థితిలో ఉన్నారు, ఉచిత పథకాల ద్వారా ప్రజలకు ఆర్థిక భారము, నిత్యవసరాల పైన టాక్సు విధిస్తున్నారు, ఇది ఎంతవరకు సమంజసం అని జై భారత్ పార్టీ తరఫున నేను అడుగుతున్నాను, ప్రస్తుత ఎలక్షన్ కమిషన్ ఫండమెంటల్ రైట్స్ కు చెందినటువంటి ఆర్టికల్ 14 ప్రకారము నిర్వహించకుండా ఈక్వల్ టు రైట్ ఈక్వల్ టు ఫ్రీడం అన్నటువంటి ఫండమెంటల్ రైట్స్ లో ఎలక్షన్ కమిషన్ సింబాలిక్ విషమైతేనేమి నామినేటెడ్ విషయమైతేనేమి రాజ్యాంగబద్ధంగా వారు నిర్వహించలేకపోతున్నారు అందుకు నేను ,లా విద్యార్థిగా బాధపడుతున్నాను ఇందు నిమిత్తమై హైకోర్టును సంప్రదించడం అయినది,భవిష్యత్తులో జరగబోయే ఎలక్షన్లలో మేము సెంట్రల్ ఎలక్షన్ కమిషన్కు మీ అభ్యర్థనను ఫార్వర్డ్ చేస్తున్నామని రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ మాకు తెలియజేశారు, ఈ పత్రిక సమావేశ సందర్భంగా కర్నూల్ ప్రజలు నన్ను జై భారత్ పార్టీ తరఫున నా గుర్తు టార్చిలైట్ కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించవలసిందిగా ప్రార్థిస్తున్నాను.

# స్వతంత్ర అభ్యర్థితోనే స్వరాజ్యం

**-- ప్రజాస్వామ్యనీను కొల్లగొడుతున్న కార్పొరేట్ రాజకీయ**

**-- ఉచితాలతో ప్రజా వ్యవస్థను నిర్వీర్యం చేసిన పాలకులు**

**-- మీడియాతో కర్నూల్ స్వతంత్ర అభ్యర్థి షేక్ నౌషాద్**





బూర్జువా పార్టీలతొ కర్నూల్ నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోవడం లేదని కర్నూల్ స్వతంత్ర అభ్యర్థి షేక్ నౌషాద్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్నూల్ నియోజకవర్గ ప్రజలు కార్పొరేట్ అభ్యర్థులను కాకుండా స్వతంత్ర అభ్యర్థికి మద్దతు పలికినప్పుడు అభివృద్ధి వంద శాతం వక్కగా జరుగుతుందని అన్నారు కర్నూల్ నియోజకవర్గం గత ప్రభుత్వాలు ఆర్థికంగా రాష్ట్రాన్ని వృద్ధి సాధించలేక పోయారని, రాజకీయ వ్యవస్థ వంశపారపరవ్యవస్థగా, కుల వ్యవస్థగా మారిందని, అధికారుల నిర్లక్ష్యం, కార్పొరేటర్ వ్యవస్థలు, రాజకీయ వ్యవస్థను రాజ్యమేలుతుందని అన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు ఆర్థిక భారం ఎంతో మోపారని, రాయలసీమ జిల్లా అయినటువంటి కర్నూలులో ఎటువంటి అభివృద్ధి చేయలేదు నీటిపారుదల వ్యవస్థ, అయితే నేమి పర్యావరణనీ అయితే నేమి, గత ప్రభుత్వల నిర్లక్ష్యత వల్ల కర్నూలు వెనుకబాటుతనంగా అభివృద్ధి చెందలేకపోయింది, నేను ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేశాను, నా గుర్తు బీరువా. నన్ను గెలిపిస్తే నియోజక వర్గ ప్రజలకు , నిరుద్యోగ యువతకు ఉచిత కోచింగ్ స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్, కర్నూలు ఒక అభివృద్ధి చెందిన జిల్లాగా మారుస్తానని అన్నారు కర్నూల్ ప్రజలు గత ప్రభుత్వం పట్ల విసుకు చెందారని, కర్నూలు ప్రజలు నన్ను గెలిపిస్తే కర్నూల్ ను అభివృద్ధి దిశగా చేస్తానని, నన్ను ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలిపించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# బీజేపీ గెలిస్తే.. యోగి రాజకీయ జీవితం రెండు నెలల్లో అంతం: అరవింద్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ: బెయిల్‌పై విడుదలైన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ శనివారం తొలిసారి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ గెలిస్తే ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ రాజకీయ జీవితం రెండు నెలల్లో అంతమవుతుందని అన్నారు. ప్రతిపక్ష పార్టీల నేతలనే కాకుండా సొంత పార్టీ నేతలను కూడా బీజేపీ జైల్లో పెడుతుందని కేజ్రీవాల్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ 'ఒకే దేశం, ఒకే నాయకుడు' ప్లాన్‌ను ప్రారంభించారని, త్వరలో ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ రాజకీయ జీవితాన్ని కూడా ముగించబోతున్నారని చెప్పారు. 'అద్వానీ, మురళీ జోషి, శివరాజ్ చౌహాన్, వసుంధరా రాజే, ఖట్టర్, రమణ్ సింగ్‌ల రాజకీయాలు ముగిశాయి. యోగి ఆదిత్యనాథ్ తర్వాతి స్థానంలో ఉన్నారు. ఆయన (పీఎం మోదీ) గెలిస్తే రెండు నెలల్లో యూపీ సీఎంను మారుస్తారు' అని అన్నారు.కాగా, బీజేపీలో అధికారాన్ని స్వాధీనం చేసుకోవడం వెనుక ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా కీలకంగా వ్యవహరిస్తున్నారని అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు.



# తాలిబన్ దేశాన్ని ముంచెత్తిన వరదలు..

**ఒక్కరోజులోనే 200 మంది మృతి..!**



తాలిబన్ పాలిత దేశమైన ఆఫ్ఘానిస్థాన్ ను ఆకస్మిక వరదలు ( ముంచెత్తాయి. ఉత్తర ఆఫ్ఘానిస్థాన్‌లో తాజాగా కురిసిన వర్షాలకు వరద పోటెత్తింది. దీంతో చాలా ప్రాంతాలు నీట మునిగాయి. వరదల కారణంగా భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. ఉత్తర ఆఫ్ఘానిస్థాన్‌లో వరదల కారణంగా ఒక్కరోజులోనే కనీసం 200 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తాలిబన్ అధికారులు ప్రకటించారు. అనేక ఇళ్లు వరదలు కొట్టుకుపోయాయి. సుమారు 100 మందికిపైగా ప్రజలు గాయపడినట్లు చెప్పారు. బాగ్లాన్ ప్రావిన్స్ లోని ఐదు జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదైనట్లు చెప్పారు. పదుల సంఖ్యలో ప్రజలు గల్లంతైనట్లు పేర్కొన్నారు.గత నెలలో కురిసిన భారీ వర్షాలకు 100 మంది మరణించిన విషయం తెలిసిందే. ఆ విషాదం నుంచి కోలుకోకముందే మరోసారి వరదలు ఆఫ్ఘాన్‌ను ముంచెత్తడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా ప్రాంతాలను వరద చుట్టుముట్టింది. దీంతో ప్రజలు ఎటూ వెళ్లలేక ఇళ్లలోనే చిక్కుకుపోయిన పరిస్థితి. రంగంలోకి దిగిన అధికారులు వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు చర్యలు చేపట్టారు. భారీ వర్షాలకు రాజధాని కాబూల్‌కు ఉత్తర ఆఫ్ఘానిస్థాన్‌ను కలిపే ప్రధాన రహదారిని సైతం మూసివేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ వర్షాలకు దాదాపు రెండు వేల ఇళ్లు, మసీదులు, పాఠశాలలు దెబ్బతిన్నట్లు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా.

# టోల్ గేట్ల వద్ద భారీ క్యూ...

**సొంతూళ్లకు నగర జనం**

హైదరాబాద్, మే 11: ఏపీలో ఓట్ల పండుగ మొదలు కానుంది. ఎన్నికల వేళ అక్కడ తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు హైదరాబాద్ (ఊఎటవతీజీఎజీట)లో స్థిరపడిన ఓటర్లు భారీగా తరలివెళ్తున్నారు. ఉద్యోగ, ఉపాధి కోసం ఇక్కడ ఉండి ఐదేళ్లకోసారి తమకు ఇష్టమైన నాయకున్ని ఎన్నుకునేందుకు ఉత్సాహంగా సొంతూళ్లకు కదులుతున్నారు. ఈ క్రమంలో చాలామంది ఓటర్లు ప్రత్యేక బస్సులు, రైళ్లలో ఊర్లకు చేరుకుంటుండగా.. ఇంకొందరు తమ సొంత వాహనాల్లోనే స్వస్థలాలకు బయలుదేరారు. దీంతో హైదరాబాద్ – విజయవాడ హైవేపై రద్దీ నెలకొంది. వారాంతం, వరుస సెలవులు, పోలింగ్ కు ఇంకా రెండు రోజులే టైం ఉండడంతో శనివారం వేకువజాము నుంచే జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జాం నెలకొంది. ఈ వాహనాలు విజయవాడ మీదుగా రాజమహేంద్రవరం, విశాఖ వైపు తరలివెళ్తున్నాయి. జాతీయ రహదారిపై రద్దీ నేపథ్యంలో నెమ్మదిగా కదులుతున్నాయి. మరోవైపు, హైదరాబాద్ శివారు హయత్ నగర్ నుంచి అబ్దుల్లాపూర్ మెంట్ వరకూ ట్రాఫిక్ కు అంతరాయం కలుగుతోంది. అటు, చౌటుప్పల్, పంతంగి టోల్ ప్లాజాల వద్ద కూడా పెద్ద సంఖ్యలో వాహనాలు బారులు తీరాయి. మరోవైపు, హైదరాబాద్ నుంచి ఓటు వేసేందుకు వెళ్లే వారి కోసం టీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు కేటాయించింది. అటు, దక్షిణ మధ్య రైల్వే సైతం ప్రత్యేక రైళ్లు నడుపుతోంది. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రమే పలువురు ప్రత్యేక బస్సులు, రైళ్లలో తమ సొంతూళ్లకు పయనమయ్యారు. దీంతో బస్టాండ్స్, రైల్వే స్టేషన్లు కిటకిటలాడాయి. కాగా, పది రోజుల ముందే బస్సుల్లో సీట్లన్నీ ఫుల్ అయ్యాయి. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా టీఎస్ఆర్టీసీ 2 వేల ప్రత్యేక బస్సులు కేటాయించింది. ఎంజీబీఎస్ నుంచి 500, జేబీఎస్ నుంచి 200, ఉప్పల్ నుంచి 300, ఎల్బీనగర్ నుంచి 300 ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉన్నాయి. అయితే, ప్రయాణికుల రద్దీని బట్టి మరిన్ని బస్సులు పెంచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు ఎన్నికల టైంను క్యాష్ చేసుకుంటున్నారు. సాధారణ రోజుల్లో ఏపీలోని ప్రధాన నగరాలకు రూ. 500 నుంచి రూ. 1000 వరకూ టికెట్ ఛార్జీలుండగా.. ప్రస్తుతం రూ. 5 వేల వరకూ ఖర్చు చేయాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ స్లీపర్ బస్సుల్లో హైదరాబాద్ నుంచి విజయవాడ వరకూ టికెట్ రేట్లు రూ. 2,500 వరకూ చూపిస్తున్నాయని పేర్కొంటున్నారు. అలాగే, హైదరాబాద్ నుంచి విశాఖ, రాజమండ్రి, కడప, తిరుపతి వంటి ప్రధాన నగరాలకు సైతం అదే రేంజ్ లో రేట్లు చూపిస్తున్నాయని చెబుతున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ తీరుపై ఆగ్రహం



# కోటీశ్వరులు... క్రిమినల్స్...

విజయవాడ, మే 11 ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల చివరి అంకానికి చేరుకోవడంతో పార్టీల గుట్టు బయటపడింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు దాదాపు 94 శాతం మంది కోటీశ్వరులే. ప్రధాన పార్టీల తరపున దాదాపు 604 మంది రేసులో ఉన్నారు.వారిలో వైసీపీ, టీడీపీ, జనసేన తరపున 307 మంది ఉన్నారు. వైసీపీ తరపున -165 మంది, టీడీపీ నుంచి -134, జనసేన నుంచి -18, బీజేపీ నుంచి ఎనిమిది, కాంగ్రెస్ నుంచి -79 మంది, సీపీఎం, సీపీఐ నుంచి ఒకొక్కరు చొప్పున కోటీశ్వరులున్నారు.అన్ని పార్టీల అభ్యర్థుల సగటు ఆస్తి యావరేజ్ ఎనిమిది కోట్ల రూపాయలుగా పేర్కొంది. అధికార వైసీపీ, విపక్ష టీడీపీ అభ్యర్థులు కోట్లకు పడగలెత్తినవాళ్లనని అసోషియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్-ఏడీఆర్ తన నివేదికలో వెల్లడించింది. అత్యధిక ఆస్తులున్న అభ్యర్థుల్లో టీడీపీ అధినేత చంద్రబాబుకు-931 కోట్లు, మాజీ మంత్రి నారాయణకు- 824 కోట్లు, సీఎం జగన్‌కు- 757 కోట్లతో మూడో ప్లేస్‌లో నిలిచారు.ఇక సీఎం జగన్ కుటుంబానికి ఏడాదికి 73 కోట్ల రూపాయలు ఆదాయం ఉంది. జగన్ ఒక్కరికే ఏడాదికి 57 కోట్ల ఆదాయం వస్తుందని పేర్కొంది. సెకండ్ ప్లేస్‌లో టీడీపీ అభ్యర్థి జనార్ధన్‌రెడ్డి 37 కోట్లు, వైసీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్ రెడ్డి ఫ్యామిలీకి 34 కోట్ల ఆదాయం వస్తున్నట్లు అందులో ప్రస్తావించింది .మొత్తం అసెంబ్లీకి పోటీ చేస్తున్న 543 మంది అభ్యర్థులపై క్రిమినల్ కేసులు వున్నాయి. వాటిలో 374 మందిపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయి. 2019 ఎన్నికల్లో క్రిమినల్ కేసులున్నవారి సంఖ్య 331 కాగా, ఇప్పుడు ఆ సంఖ్య పెరిగింది.తీవ్రమైన క్రిమినల్ కేసులకు సంబంధించి గత ఎన్నికల్లో 220 మందిపై కేసులుండగా, ఇప్పుడు ఆ సంఖ్య 374కు చేరింది. అందులో వైసీపీ నుంచి 87 మంది, టీడీపీ-42, జనసేన -10, బీజేపీ-8, సీపీఎం, సీపీఐ ఐదుగురు అభ్యర్థులపై క్రిమినల్ కేసులున్నాయి.

# మంగళగిరిలో ఓటు 4 వేలు...

గుంటూరు, మే 11, వైసిపి గట్టి పట్టుదలతోనే ఉంది. రాష్ట్రంలో అధికారంలో రావడంతో పాటు కూటమి కీలక నాయకులు ఓడిపోవాలన్న కసితో పని చేస్తోంది. కుప్పంలో చంద్రబాబు, పిఠాపురంలో పవన్, మంగళగిరిలో లోకేష్ ను ఓడించాలని గట్టిగానే ప్రయత్నం చేస్తోంది. గత ఐదేళ్లుగా ఆయా నియోజకవర్గాలపై వైసీపీ కీలక నేతలు ఫోకస్ పెట్టారు. ఎట్టి పరిస్థితుల్లో ఆ ముగ్గురు నేతలు అసెంబ్లీ గేటు ను కూడా తాకకూడదని జగన్ భావిస్తున్నారు. అందులో భాగంగానే వై నాట్ 175 అన్న నినాదాన్ని బయటకు తీశారు. వై నాట్ కుప్పం, వై నాట్ పిఠాపురం, వై నాట్ మంగళగిరి అన్న నినాదాన్ని హోరెత్తించారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు జరుగుతుండడంతో నిర్దిష్టమైన నియోజకవర్గాల్లో పూర్తిస్థాయి దృష్టి పెట్టడం సాహసమే. అందుకే ఈ మూడు రోజుల పాటు ప్రజలకు తాయిలాలు ఇచ్చి.. తమ వైపు తిప్పుకోవాలని వైసీపీ ప్రయత్నాలు చేస్తోందని కూటమి పార్టీలు ఆరోపిస్తున్నాయి.చంద్రబాబుతో పాటు పవన్ ఓడించడం దాదాపు అసాధ్యమని వైసిపి ఒక నిర్ణయానికి వచ్చింది. ఆ ఇద్దరు నేతల మెజారిటీని తగ్గించాలని మాత్రమే ప్రయత్నిస్తోంది. అయితే మంగళగిరిలో లోకేష్ ను ఓడించి ఆయన రాజకీయ జీవితాన్ని దెబ్బతీయాలని భావిస్తోంది. గత ఎన్నికల్లో సిట్టింగ్ మంత్రిగా ఉన్న లోకేష్ మంగళగిరి నుంచి పోటీ చేసి ఓడిపోయారు. మంగళగిరిలో టిడిపి గెలిచిన దాఖలాలు లేవు.

# ఎన్నికల టైంలో డబ్బుల విడుదల..

## టీడీపీ, వైసీపీల్లో ఎవరికి ప్రయోజనం?

విజయవాడ, మే 11 ఏపీలో ఎన్నికల ముంగిట సంక్షేమ పథకాల నిధుల జమకు సంబంధించి రాజకీయం నడుస్తోంది. గతంలో జగన్ సర్కార్ అమలు చేసిన సంక్షేమ పథకాలను నిలిపివేస్తూ ఎలక్షన్ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ వ్యవహారానికి సంబంధించి లబ్ధిదారులకు నిధుల విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఊరటనిస్తూ హైకోర్టు ఒక్కరోజు స్టే విధించింది. శుక్రవారం ఒక్కరోజే సంక్షేమ పథకాలకు సంబంధించి బటన్ నొక్కిన నిధులవిడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ విషయంలో ఎటువంటి ఆర్భాటం చేయవద్దని కూడా ఆదేశాలు జారీ చేసింది. ఇది గేమ్



చేంజర్ అవుతుందని వైసిపి భావిస్తోంది. కానీ ఇందులో ప్రభుత్వ చిత్తశుద్ధి లేదని.. సంక్షేమ పథకాల విషయంలో ప్రజల అభిప్రాయం మారిందని.. ప్రభుత్వానికి అమలు చేయాలని ఉద్దేశం ఉంటే.. ఎన్నికల నోటిఫికేషన్ ముందే అమలు చేసి ఉండేదని విపక్షాలు చెప్పుకొస్తున్నాయి.గత ఐదు సంవత్సరాలుగా జగన్ సంక్షేమ తారకమంత్రాన్ని నమ్ముకున్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. కానీ చాలా వరకు పథకాల్లో లబ్ధిదారుల సంఖ్యలో కోత విధిస్తున్నారు. ఏడాదికేడాది సంక్షేమ పథకాల లబ్ధిదారుల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. కానీ గణాంకాలను చూస్తూ తమది సంక్షేమ ప్రభుత్వమని వైసిపి నేతలు చెప్పుకొస్తూ వచ్చారు. సంక్షేమ పథకాల అమలు విషయంలో గత ఐదేళ్లుగా ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. పరిమితికి మించి రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేస్తూ వచ్చింది. ఇప్పుడు చివరి ఏడాదికి వచ్చేసరికి రుణ పరిమితి దాటిపోయింది. సంక్షేమ పథకాల అమలుకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి. మరోవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి.. రాష్ట్రంలో టిడిపి కూటమిలోకి చేరింది. దీంతో కేంద్రం నుంచి సహాయ నిరాకరణ సైతం ఎదురయ్యింది.ఈ ఏడాది సంక్రాంతి నుంచి జగన్ బటన్ నొక్కిన పథకాలకు సంబంధించి.. చాలా వాటికి నిధులు జమ కాలేదు. దీంతో లబ్ధిదారుల్లో ఒక రకమైన ఆందోళన నెలకొంది. వైయస్సార్ ఆసరా, విద్యా దీవెన, రైతులకు ఇన్పుట్ సబ్సిడీ వంటి వాటి విషయంలో లబ్ధిదారులకు ఎదురుచూపు తప్పలేదు. ఎప్పుడో నెలల ముందు ఈ పథకాలకు సంబంధించి జగన్ బటన్ నొక్కారు. కానీ నిధులు జమ కాలేదు. అటు ఎన్నికల నిబంధనలతో.. ఈ సంక్షేమ పథకాల అమలు విషయంలో ఈసీ ఆంక్షలు విధించింది. అయితే దీని వెనుక తెలుగుదేశం హస్తం ఉందని వైసిపి ఆరోపించడం ప్రారంభించింది. అయితే ఎన్నికల నోటిఫికేషన్ కు నెలల ముందు బటన్ నొక్కిన పథకాలకు నిధులు జమ కాకపోవడం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమైంది. తెలుగుదేశం పార్టీ సైతం ఇదే విషయం లేవనెత్తింది. అయితే సంక్షేమ పథకాల అమలు విషయములో జగన్ కు క్రెడిబిలిటీ ఉండడంతో ఎక్కువ శాతం మంది ప్రజలు నమ్ముతూ వచ్చారు. అదే సమయంలో ప్రభుత్వ వ్యతిరేక వర్గాలు, బాధిత వర్గాలు మాత్రం.. పథకాల అమలు విషయంలో ప్రభుత్వ చిత్తశుద్ధిని శంకిస్తున్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బటన్ నొక్కిన రెండు మూడు రోజుల్లో నిధులు జమ చేసేది అని చెప్పుకొస్తున్నారు.

# పోస్టల్ బ్యాలెట్..

## ఎవరికి లాభం.. ఎవరికి నష్టం




విజయవాడ, మే 11 ఏపీ రాజకీయాలు సెగలు పుట్టిస్తున్నాయి. అధికార, ప్రతిపక్ష కూటమిల మధ్య గట్టి యుద్ధమే నడుస్తోంది. మరోసారి అధికారమే లక్ష్యంగా వైసిపి అధినేత జగన్ పావులు కదుపుతున్నారు. వ్యూహాలు రూపొందిస్తున్నారు. ఎలాగైనా జగన్ ను అధికారం నుంచి దూరం చేయాలని చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ వ్యూహరచన చేస్తున్నారు. బిజెపి మద్దతుతో ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో ప్రతి ఓటు కీలకంగా మారింది ముఖ్యంగా ఈసారి ఉద్యోగుల బ్యాలెట్ ఓటు ప్రాధాన్యత అంశంగా మారింది. పార్టీల గెలుపోటములను నిర్దేశించనుంది.ఏపీలో హోరా హోరీ ఫైట్ నేపథ్యంలో బ్యాలెట్ ఓటు కీలకంగా మారనుంది. తక్కువ ఓట్లతో గెలుపొటములు ఉంటాయని నిపుణులు భావిస్తున్న తరుణంలో బ్యాలెట్ ఓటు కీలక భూమిక పోషించనుంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు డిసైడింగ్ ఫ్యాక్టర్ గా మారనున్నాయి. అందుకే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కి ఎన్నడూ లేనంత ప్రాధాన్యత పెరిగింది. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఈసారి శత శాతం ఓట్లు వేయడానికి మొగ్గు చూపించారు.ఈనెల 13న పోలింగ్ జరగనున్న సంగతి తెలిసిందే. నాడు విధి నిర్వహణలో ఉండే ప్రభుత్వ ఉద్యోగుల కోసం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ల ఓటింగ్ దాదాపు ఆరు రోజులు పాటు కొనసాగింది. ఈనెల నాలుగున ప్రారంభమైన ఓటింగ్ 10వ తేదీ వరకు కొనసాగుతూనే ఉంది. ఉపాధ్యాయులతో పాటు వివిధ శాఖల్లో పని చేస్తున్న లక్షలాదిమంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరితోపాటు 85 ఏళ్లు నిండిన వయోవృద్ధుల కోసం హోం ఓటింగ్ ఈసారి నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ తీరు చూస్తే ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధికార వైసీపీ పై ఉన్న అసహనం, ఆగ్రహం స్పష్టంగా కనబడింది. ఇప్పటివరకు అన్ని వర్గాలు తమ వైపు ఉన్నారని భావించిన వైసీపీకి గట్టి షాక్ తగిలింది.అటు పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో వైసిపి పై ఉన్న సానుకూలత క్రమేపి తగ్గుముఖం పడుతోంది. సోషల్ మీడియాలో సైతం వ్యతిరేక విశ్లేషణలు ప్రారంభమయ్యాయి. ఉద్యోగ ఉపాధ్యాయ ఓట్లన్నీ తమకేనని నిన్న మొన్నటి వరకు ధీమాగా ఉన్న అధికార పార్టీ ఇప్పుడు చేతులెత్తేసింది. సమయానికి జీతాలు ఇవ్వకుండా ఉద్యోగులను తిప్పలు పెట్టారని.. టీచర్లకు వైన్ షాపుల వద్ద డ్యూటీలు వేశారని.. వారితో పాఠశాలల్లో మరుగుదొడ్లు కడిగించారని.. అన్ని శాఖల ఉద్యోగుల స్వేచ్ఛను హరించినందుకు.. తమ ఆగ్రహం పోస్టల్ బ్యాలెట్ ఓట్ల రూపంలో ఉద్యోగ ఉపాధ్యాయులు చూపించారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఏపీలో 2,38,468 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదయ్యాయి. 2024 ఎన్నికల్లో మే 4 నుంచి 8వ తేదీ వరకు 4,32,222 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు. దాదాపు 5లక్షల ఓట్లు దాటతాయని అంచనా వేస్తున్నారు. శుక్రవారం సాయంత్రానికి పూర్తి లెక్కలు వెలువడే అవకాశం ఉంది.రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఐదు రోజులుగా నియోజకవర్గ కేంద్రాల్లో, జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ సెంటర్లలో క్యూలైన్లలో నిలబడి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. పలు ప్రాంతాల్లో ఉద్యోగుల ఓట్లు గల్లంతు కావడంతో స్పాట్‌లో రిజిస్ట్రేషన్ చేసి ఓటు వేయడానికి ఈసీ ఉత్తర్వులు జారీ చేసింది. 8వ తేదీ వరకు 4,32,222 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.స్పష్టంగా చెప్పాలంటే పోస్టల్ బ్యాలెట్ లలో టిడిపి కూటమిదే పైచేయిగా కనిపిస్తోంది.అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానని జగన్ విపక్షనేతగా హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చాక మాట మార్చారు. తన పాలన 30 నెలలు గడిచిన తర్వాత.. ప్రభుత్వముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ద్వారా క్షమించండి అని జగన్ ప్రకటించారు. అదో సాంకేతిక అంశమని.. తెలియకుండా హామీ ఇచ్చానని.. తప్పయిపోయిందని ప్రకటన చేయించారు. గత ప్రభుత్వం ఇచ్చిన రాయితీలు, వసతులను సైతం రద్దు చేశారు. జీతాలు సైతం సక్రమంగా చెల్లించలేదు. ఇవన్నీ ప్రతికూలత చూపాయి. మరోసారి జగన్ అధికారంలోకి వస్తే ఉద్యోగ,ఉపాధ్యాయుల ఉనికి ప్రశ్నార్థకం అవుతుందన్న ఆందోళన సర్వత్ర వ్యక్తమవుతోంది. అందుకే ఈసారి పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. అధికార పార్టీపై ఉన్న వ్యతిరేకత.. కూటమి వైపు ఉద్యోగ, ఉపాధ్యాయులు మొగ్గు చూపినట్లు స్పష్టమవుతోంది.

# రోజా వర్సెస్ జబర్దస్త్ టీమ్


తిరుపతి, మే 11 సినిమాలు తగ్గిపోయాక.. టీవీ షోలను నమ్ముకుని చాలా కాలం గడిపారు మంత్రి రోజా.. తనకు గుర్తింపు తెచ్చిన సినీ ఇండస్ట్రీపై సీఎం జగన్ పెత్తనం చేయాలని చూసినా .. ఆమె ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారు. రాజకీయాల్లో ఐరన్ లెగ్ అని బ్రాండ్ వేయించుకున్న ఆమె ఎట్టకేలకు మినిస్టర్ అవ్వగలిగారు. మరోసారి నగరి బరిలో దిగిన రోజా ఎప్పటిలాగే తన వివాదాస్పద వ్యాఖ్యలతో ట్రోల్ అవుతున్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారాల్లో సినీ నటులకు ధీటుగా ఫోకస్ అవుతున్నారు టీవీ స్టార్లు ముఖ్యంగా జబర్దస్త్ ఫేంలు తమ పంచ్ డైలాగ్‌తో ఆకట్టుకుంటున్నారు. ఆ క్రమంలో పవన్ అభిమాని హైపర్ ఆదిని చిన్నచూపు చూస్తూ రోజా చేసిన వ్యాఖ్యలు పెద్ద కాంట్రవర్సీకే దారితీస్తున్నాయి.మినిస్టర్ రోజా టీడీపీతో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన మాజీ హీరోయిన్ రోజా .. టీడీపీలో ఆమె అడుగుపెట్టారో లేదో చంద్రబాబుపై అలిపిరి వద్ద బాంబు దాడి జరిగింది. ఆ తర్వాత 2004 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయింది. అప్పటికి 9 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు మాజీ అయ్యారు. తర్వాత కాంగ్రెస్ వరుసగా రెండో సారి అధికారంలోకి రావడంతో రోజా వైఎస్ పంచకు చేరారు. పాపం అదే సమయంలో హెలికాప్టర్ ప్రమాదంలో ఆయన దివంగతులయ్యారు. ఆ ఎఫెక్ట్‌తో రోజాకు ఐరెన్ లెగ్ టాగ్ లైన్ వచ్చేసింది.తర్వాత జగన్ బాటపట్టి 2014లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన రోజా .. వైసీపీ అధికారంలోకి రాకపోవడంతో జబర్దస్త్ షోలు చేసుకుంటూ గడిపేశారు .. సినిమాల కంటే జబర్దస్త్ షోలతోనే ఆమె పాపులర్ అయ్యారన్న టాక్ ఉంది ? వైసీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పటి నుంచి టీడీపీ, జనసేనలను టార్గెట్ చేయడమే పనిగా పెట్టుకున్నారామె.. మరీముఖ్యంగా జగన్ మెప్పుకోసం జనసేనానిపై ఒంటికాలితో లెగుస్తుంటారు? పీకే పవర్‌స్టార్ అసలు పార్టీ ఎందుకు పెట్టారో అర్థం కాదని .. చంద్రబాబు వేసిన కుక్క బిస్కెట్ల కోసం పవన్ తోక ఊపుకుంటూ వెళ్లారని యద్దేవా చేస్తుంటారు.జనసేనానిపై రోజా వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు జబర్దస్త్ ఫేం హైపర్ ఆది .. ప్రస్తుతం కూటమి అభ్యర్థులకు మద్దతుగా మద్దతు కూడ చేస్తున్న ఆది.. పవన్ గురించి మాట్లాడే అర్హత లేని వారు కూడా మాట్లాడుతున్నారని కౌంటర్ ఇచ్చారు. పవన్ వ్యక్తిత్వాన్ని ఆకాశానికెత్తేస్తూ మాట్లాడారు. పవన్‌కళ్యాణ్ కులాన్ని తాకట్టుపెట్టారనడాన్ని తప్పుపట్టారు. రోజాకు పవన్ సైతం గట్టిగానే కౌంటర్ ఇచ్చారు. యువగళం సభలో డైమంట్ రాణి అని యద్దేవా చేశారు.ఆ క్రమంలో హైపర్ ఆది ఎన్నికల ప్రచారంలో వైసీపీ మంత్రులకు తమ శాఖలేవో తెలియదని వ్యాఖ్యానించారు. దానిపై స్పందించిన రోజా.. పాపం చిన్న ఆర్టిస్టులు.. చిన్న చిన్న షోలు. పాత్రలు చేసుకొనేవారని తెగ జాలి కురిపించారు. వారిపై ఎందుకు ఈ ప్రతాపాలు.. వారి వెనుక ఎవరు ఉండి ఇవన్నీ అనిపిస్తున్నారో వారిని అనాలి. ఎన్నికల సభల్లో చిన్న చిన్న ఆర్టిస్టులను పిలిచి మాట్లాడించుకొనే పరిస్థితికి పవన్ దిగజారిపోయారని వారు కూడా మెగా కుటుంబంతో విరోధం పెట్టుకుంటే ఇండస్ట్రీలో లేకుండా చేస్తారేమో అన్న భయంతో ఏది మాట్లాడమంటే అది మాట్లాడుతున్నారని చెప్పుకొచ్చారు. మంత్రులకు అసలు శాఖలే తెలియవు అని అంటే.. ఇండస్ట్రీని తొక్కేయడానికి జగన్ చూస్తున్నారన్న విమర్శలున్నాయి. సినిమా టికెట్ల వ్యవహారంలో చిరంజీవి, మమేష్‌బాబు, ప్రభాస్ వంటి స్టార్ హీరోలు తనకు కలవడానికి వచ్చినప్పుడు జగన్ వ్యవహరించిన తీరు వివాదాస్పదమైంది.. దానిపై ఇప్పటికీ సినీ ప్రముఖులు విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు ? తాజాగా భారతీయుడు లాంటి మెగా హిట్లు నిర్మించిన ప్రొడ్యూసర్ ఏ ఏం రత్నం కూడా జగన్‌ని టార్గెట్ చేశారు. సినిమా పరిశ్రమ తొక్కాలని జగన్ ప్రభుత్వం ప్రయత్నించిందని రత్నం ఆరోపించారు.మరోవైపు హైపర్ ఆదిపై రోజా చేసిన వ్యాఖ్యలతో ఆమె అందరికీ టార్గెట్ అవుతున్నారు. జబర్దస్త్ ఫేమ్ ఆర్.పి. ఆమెపై ఒక రేంజ్లో విరుచుకుపడ్డారు. యువరాణి రోజా గొప్ప నటా? ఆస్కార్ అవార్డులు కొట్టిందా? కనీసం గెటప్ శీను , ఆది, సుధీర్ వంటి నటుల కోవలో స్కిట్స్ చేయగలదా? అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రోజా మాకు గౌరవం ఇస్తే .. మేము గౌరవిస్తాం. తమని చిన్న నటులని చులకన భావనతో మాట్లాడటం రోజాకు ఎంత మాత్రం తగదని హెచ్చరించారు.

# విశాఖ లో ఎవరి ధీమా వారిదే

విశాఖపట్టణం, మే 11 దేశవ్యాప్తంగా గుర్తింపు ఉన్న పార్లమెంట్ స్థానాల్లో విశాఖ ఒకటి. పర్యాటకంగా గుర్తింపు పొందింది విశాఖ నగరం. విశాఖ స్టీల్ ప్లాంట్ తో పాటు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు విశాఖలో ఎక్కువగా ఉన్నాయి. సుదీర్ఘ తీర ప్రాంతం ఈ నగరం సొంతం. అందుకే జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించింది విశాఖ నగరం. అందుకే ఇక్కడ పాగా వేసేందుకు అన్ని పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రస్తుతం ఇక్కడ సార్వత్రిక ఎన్నికలు హోరాహోరీగా సాగుతున్నాయి. గెలుపు సైతం ప్రతిష్టాత్మకంగా మారుతోంది.వైసిపి అనూహ్యంగా మంత్రి బొత్స సత్యనారాయణ సతీమణి ఝాన్సీ లక్ష్మి బరిలో దించింది. కూటమి అభ్యర్థిగా టిడిపి నుంచి భరత్ పోటీ చేస్తున్నారు. వాస్తవానికి పొత్తులో భాగంగా ఈ సీటును బిజెపి కోరుకుంది. ఆ పార్టీకి చెందిన రాజ్యసభ మాజీ సభ్యుడు జీవీఎల్ నరసింహం అయితే కొన్నేళ్లుగా సాగరనగరంలో కార్యకలాపాలు ప్రారంభించారు. ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు అధికంగా ఉండడం, పొత్తులో భాగంగా ఈ సీటును బిజెపికి టిడిపి విడిచి పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. అయితే గత ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసిన భరత్ తక్కువ మెజారిటీతో ఓడిపోయారు. గత ఐదు సంవత్సరాలుగా పార్లమెంట్ స్థానం పరిధిలో టిడిపి బలోపేతానికి కృషి చేస్తూ వచ్చారు. పైగా నందమూరి బాలకృష్ణ చిన్నల్లుడు. అందుకే ఈ సీట్ ను వదులుకునేందుకు టిడిపి ఇష్టపడలేదు. పైగా పొత్తును వ్యతిరేకించిన జీవీఎల్ కు అవకాశం లేకుండా చేయాలని భావించారు. అందుకే విశాఖ బదులు అనకాపల్లి పార్లమెంట్ స్థానాన్ని బిజెపికి కేటాయించి.. సీఎం రమేష్ అభ్యర్థిత్వాన్ని ఆమోదించారు.విశాఖ పార్లమెంట్ స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. విశాఖ నగరంలోని నాలుగు నియోజకవర్గాలు, గాజువాక, భీమిలితోపాటు విజయనగరం జిల్లా శృంగవరపుకోట నియోజకవర్గం విశాఖ లోక్ సభ పరిధిలో ఉన్నాయి. ఇక్కడ తన భార్యను గెలిపించేందుకు మంత్రి బొత్స సత్యనారాయణ సర్వ శక్తులు ఒడ్డుతున్నారు. అయితే విశాఖ నగరానికి సంబంధించి దక్షిణ నియోజకవర్గంలో వైసిపి బలంగా కనిపిస్తోంది. ఉత్తరంలో సైతం ఆ పార్టీకి ఎడ్జ్ ఉంది. తూర్పులో మాత్రం టిడిపి బలంగా ఉంది. గాజువాకలో టిడిపికి అనుకూలంగా ఉంది. భీమిలిలో భారీ మెజారిటీ దక్కే ఛాన్స్ కనిపిస్తోంది. శృంగవరపుకోట నియోజకవర్గంలో అధికార పార్టీ ఎమ్మెల్సీ భార్యతో పాటు మెజారిటీ క్యాడర్ టిడిపి వైపు మొగ్గు చూపింది. దీంతో అక్కడ వైసిపి గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. అయితే గతంలో తక్కువ ఓట్ల మెజారిటీతో ఓడిపోవడం భరత్ వైపు సానుభూతి కనిపిస్తోంది.బొత్స ఝాన్సీ లక్ష్మి బలమైన సామాజిక వర్గానికి చెందినవారు కావడం.. మంత్రి బొత్స కు ఎలక్షన్ క్యాంపెయిన్ తెలియడం వంటి కారణాలతో ఈ సీటు హాట్ గామారింది. ఇరు పార్టీలు గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. గత ఎన్నికల్లో ఎనిమిది వేల ఓట్లతోనే వైసిపి ఈ స్థానాన్ని గెలుచుకుంది. అప్పట్లో జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన జెడి లక్ష్మీనారాయణ రెండున్నర లక్షల ఓట్లు సొంతం చేసుకున్నారు. అయితే ఇప్పుడు జనసేనతో పొత్తు, మరోవైపు ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు బిజెపి కూటమి వైపు మొగ్గుచూపుతుండడంతో.. సునాయాస విజయం దక్కించుకోవచ్చని టిడిపి భావిస్తోంది. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, విశాఖ రాజధాని వంటి అంశాలతో తమకు మొగ్గు ఉందని వైసీపీ నేతలు చెబుతున్నారు. మరి ప్రజల అభిప్రాయం ఎలా ఉందో చూడాలి. జూన్ 4న ఫలితం వెల్లడయ్యే వరకు వేచి చూడక తప్పదు.

# బిజీ బిజీగా చంద్రబాబు

తిరుపతి, మే 11 చంద్రబాబు పని రాక్షసుడు అన్న పేరు ఉంది. రాజకీయంగా చివరి నిమిషం వరకు ఆయన పోరాడుతారు. ఎన్నికల్లో టిడిపిని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలు అన్ని ఇన్ని కావు. ఏడుపదుల వయసులో కూడా క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. ఒకవైపు ఎన్నికల ప్రచార సభలు, మరోవైపు భాగస్వామ్య పక్షాల నేతలతో కలిసి వేదికలు పంచుకోవడం, ఎన్నికల వ్యూహాలు.. ఇలా ఆ వయసులో కూడా కష్టపడి పని చేస్తున్నారు చంద్రబాబు. ఈరోజు ఒక్కరోజే ఉండి, ఏలూరు, గన్నవరం, మాచర్ల, ఒంగోలు నియోజకవర్గాల్లో జరిగే ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు పాల్గొని ఉన్నారు. అంటే రాష్ట్రంలోని మూడు ప్రాంతాలను టచ్ చేయనున్నారు.ఈ ఎన్నికలు తెలుగుదేశం పార్టీకి జీవన్మరణ సమస్యలాంటివి. అందుకే చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. వయస్సును లెక్కచేయకుండా గట్టిగానే కృషి చేస్తున్నారు. ఇప్పటివరకు 82 ప్రజాగళం సభల్లో చంద్రబాబు పాల్గొన్నారు. ఈరోజు 5చోట్ల, రేపు మూడు చోట్ల ప్రజాగళం సభల్లో చంద్రబాబు పాల్గొంటారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 90 సభల్లో పాల్గొన్నట్లు అవుతోంది. చిత్తూరు జిల్లా పలమనేరులో మార్చి 27న ప్రజాగళం సభ ప్రారంభమైంది. రేపటి సభలతో తను అనుకున్న లక్ష్యాన్ని చంద్రబాబు చేరుకోనున్నారు.అయితే చంద్రబాబు ఈ వయసులో కూడా ఉత్సాహంగా సభల్లో పాల్గొనడం ప్రత్యర్థుల అభినందనలు సైతం అందుకుంటున్నారు. అయితే ఒక్క ప్రజాగళం సభలే కాదు.. ప్రధాని మోదీ, అమిత్ షా, పవన్ కళ్యాణ్ తో సైతం వేదికలు పంచుకున్నారు. ప్రైవేట్ కార్యక్రమాలు ఉండనే ఉన్నాయి. సీట్ల సర్దుబాటు, ఓట్ల బదలాయింపు వ్యూహాల్లో సైతం చంద్రబాబు క్షణం తీరిక లేకుండా గడిపారు. అయితే టిడిపి కూటమి అధికారంలోకి రాబోతుందని ప్రజల్లోకి సంకేతం పంపడం, టిడిపి శ్రేణుల్లో ధైర్యం నింపడం వంటి వాటిలో చంద్రబాబు కొంత వరకు సక్సెస్ అయ్యారు. అయితే అన్నింటికీ మించి 50 రోజుల వ్యవధిలో 90 సభల్లో పాల్గొనడం ఆషామాషీ విషయం కాదు. ఈ విషయంలో చంద్రబాబుకు అభినందించక తప్పదు.





విభారే న్యూస్ కర్నూల్ మే,12: కర్నూల్ నియోజకవర్గం ఇండిపెండెంట్ అభ్యర్థి నౌషద్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఆర్థికంగా ఎంతో రాష్ట్రాన్ని వృద్ధి సాధించలేక పోయారని, రాజకీయ వ్యవస్థ వంశపారపరవ్యవస్థగా, కుల వ్యవస్థగా మారిందని అధికారుల నిర్లక్ష్యం, కార్పొరేటర్ వ్యవస్థలు, రాజకీయ వ్యవస్థను రాజ్యమేలుతుందని, ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు ఆర్థిక భారం ఎంతో మోపారని, రాయలసీమ జిల్లా అయినటువంటి కర్నూలులో ఎటువంటి అభివృద్ధి చేయలేదు నీటిపారుదల వ్యవస్థ, అయితే నేమి పర్యావరణపరంగా అయితే నేమి, గత ప్రభుత్వల నిర్లక్ష్యత వల్ల కర్నూలు వెనుకబాటుతనంగా అభివృద్ధి చెందలేకపోయింది, నేను ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేశాను, నా గుర్తు బీరువా గుర్తు, నన్ను గెలిపిస్తే నియోజక వర్గ ప్రజలకు నా దగ్గర ఒక ప్లాను ఉందని, నిరుద్యోగ యువతకు ఉచిత కోచింగ్ స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్, కర్నూలు ఒక అభివృద్ధి చెందిన జిల్లాగా మారుస్తానని, కర్నూల్ ప్రజలు గత ప్రభుత్వం పట్ల విసుకు చెందారని, కర్నూలు ప్రజలు నన్ను గెలిపిస్తే కర్నూల్ ను అభివృద్ధి దిశగా చేస్తానని, నన్ను ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలిపించవలసిందిగా పత్రిక సమక్షంగా తెలియజేస్తున్నాను

## దేవస్థానం సిబ్బందికి కరువు భత్యం. అరియర్స్

### ఈవో కు కృతజ్ఞతలు తెలిపిన సిబ్బంది



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 11 - మహానందీశ్వర స్వామి దేవస్థానం సిబ్బంది సంఘం దేవస్థాన కార్యనిర్వాహణాధికారి కాపు చంద్రశేఖర్ రెడ్డికి దేవస్థానం సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. శనివారం దేవస్థానం సిబ్బంది ఓ ప్రకటన విడుదల చేశారు , సిబ్బంది యొక్క శ్రేయస్సు నిరంతరం కోరుచూ రాష్ట్ర ప్రభుత్వము జారీచేసిన జీవోలను అనుసరించి సిబ్బంది కి ఇవ్వవలిసిన కరువు బత్యములను పూర్తిగా ఇవ్వడం జరిగిందన్నారు. అదేవిధంగా 2.73 శాతం (20.02శాతం టు 22.75శాతం ) పెంపుదల చేసినటువంటి కరువు బత్యం అరియర్స్ పైకము రూ 12,03,027/-లు ఎటువంటి బకాయి లేకుండా లేకుండా పూర్తిగా అర్హులైన దేవస్థాన సిబ్బంది అకౌంట్లో జమ చేసారని తెలిపారు. ఆ విధంగా ఎటువంటి బకాయిలు లేకుండా జీతభత్యంలు చెల్లించిన కార్యనిర్వాహణాధికారి,కాపు చంద్రశేఖర్ రెడ్డి వారిని దేవస్థానం సిబ్బంది అందరూ వారి కార్యాలయం తనందు సమావేశమై అభిప్రాయ ప్రశంసలతో పాటు కృతజ్ఞత అభినందనలు తెలియజేయడం జరిగింది.

## ఎన్నికల సంఘం నిబంధనలను పాటించండి

---జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె.శ్రీనివాసులు

---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 11 పోలింగ్కు ముందు 48 గంటల నుండి ఎన్నికలు ముగిసే వరకు కీలకమైన సమయమని పోలింగ్ ఏర్పాట్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె.శ్రీనివాసులు ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.శ్రీనివాసులు మాట్లాడుతూ పోలింగ్ చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నోడల్ అధికారులు పర్యవేక్షించుకోవాలన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీపై ఎఫ్ఎస్,టి విఎస్టి బృందాలు చురుకుగా పనిచేసి నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రాత్రివేళల్లో ప్రత్యేక నిఘా పెట్టి, సి-విజిల్, 1950 ద్వారా వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు. పోలింగ్ కేంద్రాల సమీప ప్రాంతాల్లో రాజకీయ పార్టీలు ఎలాంటి ప్రచార కార్యక్రమాలు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రెండు గంటలకు పోలింగ్ పర్సంటేజ్ ను కలెక్ట్ చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కమ్యూనికేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నందికొట్కూరు, ఆత్మకూరు నియోజకవర్గాలలో మోడల్ పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని స్వీప్ నోడల్ అధికారిని ఆదేశించారు.



# ఇదే పట్టుదలతో పని చేయండి విజయం ఖాయం...

- ప్రచారంలో కష్టపడిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు
- పోలింగ్ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండండి
- టిడిపి అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి



విభారే న్యూస్ మా ప్రతినిధి :-మే 11 డోన్ నియోజకవర్గంలో తన విజయం కోసం ప్రచారంలో కష్టపడిన ప్రతి ఒక్కరికి బిజెపి. జనసేన, టిడిపి ఉమ్మడి అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన శనివారం ఒక పత్రికా ప్రకటనలో తాను డోన్ పట్టణంలో అడుగు పెట్టిన నాటి నుంచి తన కుటుంబ అభిమానులు, టిడిపి, బిజెపి, జనసేన కార్యకర్తలు అండగా ఉన్నారని పేర్కొన్నారు. వారందరి కష్టం ఫలితంగా గత 40 రోజులుగా ప్రచార కార్యక్రమం సవ్యంగా సాగిందని స్పష్టం చేశారు. తాను విజయం సాధించాలన్న లక్ష్యంతో కృషి చేసిన మాజీ ఉప ముఖ్యమంత్రి కెయి కృష్ణమూర్తి, మాజీ మంత్రి కెయి ప్రభాకర్, టిడిపి నేత మన్నె సుబ్బారెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. ఎండలను లెక్క చేయకుండా కార్యకర్తలు పడిన కష్టాన్ని తాను నిత్యం గుర్తుంచుకుంటానని ఆయన పేర్కొన్నారు. ఇంత కాలం కష్టపడిన వారంతా పోలింగ్ ముగిసే వరకు ఇదే పట్టదలను కొనసాగించి ప్రతి ఓటరు ఓటింగ్లో పాల్గొనేలా చేయాలని ఆయన కోరారు. చంద్రబాబుపై నమ్మకంతో బెంగుళూరు, హైదరాబాదు వంటి ప్రాంతాల నుంచి ఓటేసేందుకు వచ్చారని వారికి పోలింగ్లో సహకారం అందించాలని సూచించారు. గత అయిదేళ్ల కాలం నుంచే కాకుండా తన ప్రచారంలో పాల్గొన్న కార్యకర్తలపై కూడా ప్రత్యర్థి బుగ్గన వేధింపులకు గురి చేసిన విషయం తనకు తెలుసునని వారెవరూ భయపడాల్సిన పని లేదని ధైర్యం చెప్పారు. ఇక ముందు కూడా ఆయన అలాగే ప్రవర్తిస్తాడని అయినా పట్టించుకోవద్దని తెలిపారు. రానున్న ఎన్నికల్లో తన విజయమే కాకుండా రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలో టిడిపి, బిజెపి, జనసేన కార్యకర్తలతో పాటు ఇతరులను ఇబ్బంది పెట్టిన వారెవరినీ వదిలి పెట్టే ప్రశ్నే లేదని హెచ్చరించారు. అలాగే అధికారులు సైతం ఎలాంటి పక్షపాత వైఖరి అవలంబించకుడా ఎన్నికలు సజావుతా ప్రజాస్వామ్య పద్దతిలో జరిగేలా చూడాలని కోరారు. ప్రధానంగా కొందరు పోలీసులు బుగ్గనకు అనుకూలంగా ఇప్పటికీ బహిరంగంగా మాట్లాడుతున్నారని వారందరినీ గుర్తుంచుకుంటానని తెలిపారు. ఓటరు స్వేచ్ఛగా ఓటు వేసే పరిస్థితికి ఎవరూ ఆటంకం కల్పించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లో తన కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి భవిష్యత్తులో తన సహకారం నిత్యం ఉంటుందని ఆయన తెలిపారు. ఏ సమయంలో వచ్చి తనను సహాయం కోరినా అందుకు తాను సిద్ధంగా ఉంటానని స్పష్టం చేశారు. పోలింగ్ ముగిసే వరకు కూటమి కార్యకర్తలు అప్రమత్తంగా ఉంటూ తన విజయం కోసం పట్టుదలతో పని చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## నా స్నేహితుని కోసం ఇలా వచ్చాను: ఐకాన్ స్టార్ అల్లు అర్జున్





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 11 - నా స్నేహితుని కోసం నంద్యాల కు వచ్చానని అల్లు అర్జున్ అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సినీ హీరో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన స్నేహితుడు నంద్యాల వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవి చంద్రకిషోర్రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు శనివారం నంద్యాలకు వచ్చానని తెలిపారు . నంద్యాలకు చేరుకున్న అల్లుఅర్జున్కు శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డి అభిమానులు, అల్లు అర్జున్ అభిమానులు పెద్ద ఎత్తున చేరుకొని గజమాలతో అపూర్వస్వాగతం పలికారు. అక్కడ నుండి ఇంటికి చేరుకున్న అల్లు అర్జున్ దంపతులు శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డి గృహానికి వచ్చారు. వీరికి మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవి రెడ్డి, నాగని రవిసింగారెడ్డి, శిల్పారెడ్డి, ధరణిరెడ్డిలు ఆత్మీయ స్వాగతం పలికారు. అక్కడ నుండి శిల్పా రవిరెడ్డి అభిమానులకు, అల్లు అర్జున్ అభిమానులకు అభివాదం చేశారు. తన మిత్రుడు శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డిని ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అల్లు అర్జున్ మాట్లాడుతూ. శిల్పా రవి నాకు రాజకీయాల్లోకి రాక మందు నుండి గత 14 సంవత్సరాలుగా మంచి స్నేహితుడు... రాజీకీయాల్లోకి రాక ముందు ఆయనతో వారానికి, పదిరోజులకు కలిసేవాన్ని అయితే రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత గత 5సంవత్సరాలుగా కలవడం తగ్గిపోయింది. కారణం ఏంటంటే... శిల్పా రవి రెడ్డి ప్రజలకోసం ఎంతో కష్టపడుతున్నాడని అర్థం అయ్యిందన్నారు. తాను పడుతున్న కష్టాన్ని గ్రహించి మంచి చేస్తున్న మిత్రుడికి మద్దతు తెలియజేయడానికి నంద్యాలకు రావడం జరిగిందన్నారు. గత ఎన్నికల్లో శిల్పా రవి రెడ్డి విజయం సాధించినపుడు ట్వీట్ చేశానని, అభినందించానని, ఇది తనకు సంతృప్తిని ఇవ్వలేదని.. అందుకే ప్రత్యక్ష్యంగా తన సంపూర్ణ మద్దతు ఇచ్చేందుకు రావడం జరిగిందన్నారు. శిల్పారవిరెడ్డి ఎక్కడ ఉన్నా తన ప్రాణం అంతా నంద్యాలలోనే ఉంటుందని, తాను కష్టపడే విధానం తనకు ఎంతగానో నచ్చిందని ప్రత్యేకంగా అభినందించారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని, రాజకీయ ప్రస్థానంలో అనేక ఉన్నత స్థానాలను అధిష్టించాలని, తాను చూసి సంతోషించాలని ఆకాంక్షించారు. శిల్పా రవి రెడ్డి మాట్లాడుతూ... అల్లుఅర్జున్ పుష్ప-2 సినిమా షూటింగ్ లతో ఎంతో బిజీగా ఉండే వారని, ప్రత్యేకంగా తన కోసం మిత్రున్ని భలపరచాలని, తన సంపూర్ణ మద్దతు తెలియజేయడానికి దాదాపు 600 కిలోమీటర్లు ప్రయాణం చేసి రావడం మరచి పోలేనటువంటి ఘటం అన్నారు. అల్లుఅర్జున్ తో కలిసినపుడు ఎప్పుడూ..సామాజిక సేవ గురించి మాట్లాడుతూ ప్రజలకు ఏవిధంగా మంచి చేయవచ్చు అని చర్చించుకొనేవారమన్నారు. సినీహీరో అయినా సరే ప్రజలకు మంచి చేయాలని, మనతోపాటు పది మందిని అభివృద్ధిలోకి తీసుకురావాలి, సాయం అందించాలి, తనతోపాటు తనతోటి మిత్రులు అందరు తనలాగే ఉండాలని మంచి ఆలోచనగలిగిన వ్యక్తి అని ప్రశంసలు కురిపించారు. అల్లుఅర్జున్ తో తనకు దాదాపు12 సంత్సరాల అనుబంధం ఉందని, కలసి తిరిగేవారమని, తాను రాజకీయాల్లో లేకపోయినా సరే రాజకీయాల్లో ఎలా ధైర్యంగా ముందుకు వెళ్లాలన్న విషయాలను చెబుతూ వెన్నుతట్టి ప్రోత్సహించేవారని తెలిపారు. అలాగే ప్రజలకు ఏవిధంగా మంచి చేయాలనే ఆలోచన కలిగిన వ్యక్తి అన్నారు. తనకోసం తన విజయాన్ని కాంక్షించి మద్దతు తెలిపిన తన మిత్రుడు అల్లుఅర్జున్కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

## మూడవ విడత ర్యాండ మైజేషన్ పూర్తి

### జిల్లా ఎన్నికల అధికారి డా జి.సృజన





కర్నూలు )మే 11,. విభారే న్యూస్ . పిఓ, ఎపిఓ, ఓపిఓ, మైక్రో అబ్జర్వర్లకు సంబంధించిన మూడవ విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసి సంబంధిత నియోజకవర్గాలలోని పోలింగ్ కేంద్రాలకు కేటాయించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ డా జి.సృజన పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ లోని ఎన్ఐసి సమావేశ మందిరంలో జనరల్ అబ్జర్వర్ జాఫర్ పర్యవేక్షణలో పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లకు మూడవ విడత రాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించి పోలింగ్ కేంద్రాలకు కేటాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే రెండవ విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసి పోలింగ్ సిబ్బందిని, మైక్రో అబ్జర్వర్లను నియోజకవర్గాలకు కేటాయించడం జరిగింది, ఈరోజు మూడవ విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసి నియోజకవర్గాలలోని పోలింగ్ కేంద్రాలకు కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఓ మధుసూదన్ రావు, జిల్లా ఖజానా శాఖ అధికారి రామచంద్ర రావు, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి దీప్తి, జిల్లా ఇన్ఫార్మాటిక్ అధికారి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణలో అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలి

---జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె.శ్రీనివాసులు

---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 11 ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో పోటీ చేసిన అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె.శ్రీనివాసులు కోరారు. శనివారం కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్ లో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు చివరి 48 గంటల ప్రోటోకాల్ పై జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.శ్రీనివాసులు మాట్లాడుతూ ఈనెల 13న జరిగే పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ వంతు సహకారాన్ని అందించాలన్నారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుండి పోలింగ్ మెటీరియల్ పోలింగ్ కేంద్రాలకు చేరవేయడం... పోలింగ్ పిదప తిరిగి ఆర్జియం, శాంతిరామ్ ఇంజనీరింగ్ కాలేజీలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచేంతవరకు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకొని సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేసామన్నారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల వెలుపలే ఏజెంట్లు కౌంటర్లు ఏర్పాటు చేసుకోవాలే తప్ప ఎలాంటి జెండాలు, బ్యానర్లు, ప్రచారానికి సంబంధించి ఐటమ్స్ ఏవి ఉండరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. పోటీ చేసే అభ్యర్థులకు ఒక వాహనము, ఎలక్షన్ ఏజెంట్లకు ఒక వాహనం, అసెంబ్లీ సెగ్మెంట్లకు ఒక వాహనం చొప్పున మూడు వాహనాలనే అనుమతిస్తామన్నారు. జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు పెద్దఎత్తున పోలీస్ సిబ్బందిని నియమించామని... ఎలాంటి గొడవలకు అవకాశం ఇవ్వకుండా పండుగ వాతావరణంలో జరుపుకునేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో సీఏపీఎఫ్ సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190